క్లుప్తంగా

నేటి నుంచి దర్గా ఉత్సవాలు



పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలోని బాబా ఫక్రుద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 3, 4 తేదీలలో నిర్వహించనున్నట్లు దర్గా ముతవల్లీ షా మహ్మద్ రహీముద్దీన్ షకీల్ షహర్వరీ తెలిపారు. ఆదివారం సాయంత్రం జల్‌పల్లి మజీద్ నుంచి సందల్ ఊరేగింపుగా బయల్దేరి మామిడిపల్లి మార్గంలోని సయ్యద్ ఫక్రుద్దీన్ బాబా దర్గాకు చేరుకుంటుంది. ప్రత్యేక ప్రార్థనల అనంతరం అన్నదానం, 4వ తేదీనా ముషాయిరా ఉంటుందని తెలిపారు. ఈ ఉత్సవాలకు నగరం నలుమూలల నుంచి భక్తులు హాజరుకానున్నారని తెలిపారు.

కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న చెన్నకిషన్‌రెడ్డి

కందుకూరు: ఇటీవల గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. శనివారం లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగాపురం గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీరాములు, నాయకులు జ్ఞానేశ్వర్, యాదగిరి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై దరఖాస్తుల వెల్లువ



దరఖాస్తులను స్వీకరిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

మాడ్గుల: భూ సమస్యల పరిష్కారానికి ధరణి స్పెషల్ డ్రైవ్‌కు దరఖాస్తులు వచ్చాయి. మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌కు 40 దరఖాస్తులు వచ్చాయి. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. రైతులు భూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

తలకొండపల్లి: మండలంలోని చుక్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా ఆస్మాఫాతీమా, డీఈఓగా మౌనిక, ఎంఈఓగా ఎండీ ఖలీల్ పాష, హెచ్‌ఎంగా ప్రహర్ష్, ఉపాధ్యాయులుగా లక్ష్మీ, జగదీశ్వరీలతో పాటు, మరి కొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు, ప్రసన్నలక్ష్మి, శ్రీదేవి, వెంకట్ పవార్, సురేష్, మాల్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

మంచాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీఓ బాలశంకర్ శనివారం సందర్శించారు. విద్యార్థులకు తాగునీరు, సరిపడా బెంచీలు వంటి మౌలిక వసతుల కల్పన ఆరా తీశారు. సెంటర్ వద్ద ఉన్న ఆశ వర్కర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. ఎంపీఓ తేజ్‌సింగ్ పాల్గొన్నారు.

ఆమనగల్లు సీఐగా ప్రమోద్‌కుమార్

ఆమనగల్లు: ఆమనగల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.ప్రమోద్‌కుమార్ బదిలీపై వచ్చారు. సీఐగా ఉన్న విజయ్‌కుమార్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. గత నెల 21న ఆమనగల్లు సీఐగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్ పది రోజులకే బదిలీ కావడం విశేషం.

వారాంతపు సంత.. సమస్యల చింత



తుక్కుగూడలో క్రయ విక్రయాలు

ఆదాయం ఘనం.. మౌలిక వసతులు శూన్యం

- మున్సిపాలిటీకి లక్షల్లో ఆదాయం
- ఇరుకుగా సంత స్థలం

తుక్కుగూడ: ఆదాయం ఘనం.. మౌలిక వసతులు శున్యంగా మారింది తుక్కుగూడ వారాంతపు సంత(త్రైబజార్) పరిస్థితి. జిల్లాలో అతిపెద్ద సంతగా పేరుగాంచి, ప్రతి ఏడాది మున్సిపాలిటీకి లక్షల్లో ఆదాయం సమకుర్చుతోంది. ఈ సంతకు తుక్కుగూడ మున్సిపాలిటీతో పాటు శంషాబాద్ మండలం, జల్‌పల్లి మున్సిపాలిటీ, నగరంలోని తదితర ప్రాంతాల నుంచి వినియోగదారులు, చిరు వ్యాపారులు వందల సంఖ్యలో వస్తుంటారు. కూరగాయాలు, నిత్యావసర సరుకులు, రైతులకు వ్యవసాయ పనిముట్లు, దుస్తులు అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు మూగజీవాల క్రయ విక్రయాలు జరుగుతాయి. ప్రతి సోమవారం జరిగే ఈ సంతలో లక్షల రూపాయల వ్యాపారం జరుగుతోంది.

మౌలిక వసుతులు నిల్

వారాంతపు సంత తుక్కుగూడ సెంటర్‌లో శ్రీశైలం జాతీయ రహదారిపై ఉంటుంది. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణం గల భూమిలో అధికారులు వెజ్, నాన్‌వెజ్ సమీకృత మార్కెట్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మంచి నీటి ట్యాంక్ నిర్మాణం చేయడంతో సంత విస్తీర్ణం పూర్తిగా తగ్గి పోయింది. ఇరుకుగా మారడంతో శ్రీశైలం జాతీయ రహదారి, తుక్కుగూడ బస్టాండ్‌లో వ్యాపారులు తమ స్టాల్‌ను ఉంచుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. సంతకు వచ్చే వారికి మరుగుదొడ్లు, మంచి నీటి వసతి, పార్కింగ్ తదితర మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంతకు మరో ప్రదేశంలో స్థలం కేటాయించి, సౌకర్యాలు కల్పించాలని వ్యాపారులు, వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్థిక సంవత్సరం	వచ్చిన ఆదాయం
2021-22	61,21,000
2022-23	74,27,102
2023-24	90,15,000

స్థలం కేటాయించాలి



జిల్లాలోనే పెద్ద వారాంతపు తుక్కుగూడ సంత. ఈ సంతలో మార్కెట్, ట్యాంక్, తదితర భవనాలు నిర్మాణం చేయడంతో సంత స్థలం పూర్తిగా తగ్గిపోయి, ఇరుకుగా మారింది. దీంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సంతకు స్థలం కేటాయించాలి.

– పొరెడ్డి బుచ్చిరెడ్డి సర్దార్‌నగర్

బీజేపీ బలోపేతానికి కృషి

ఎంపీపీ కుండె వెంకటేశ్



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ కుండె వెంకటేశ్

మహేశ్వరం: నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని మహేశ్వరం ఎంపీపీ కుండె వెంకటేశ్ పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని నియోజకవర్గ బీజేపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు కలిశారు. ఇటీవల జరిగిన మహేశ్వరం ఎంపీపీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులకు సమాన ఓట్లు రావడంతో లక్కీ డ్రాలో బీజేపీ అభ్యర్థి కుండె వెంకటేష్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ నాయకత్వంలో కిషన్‌రెడ్డిని కలిశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు ప్రతి నాయకుడు కృషి చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడారి జంగయ్య, ఎంపీటీసీ అభ్యర్థులు మద్ది రామిరెడ్డి, పోతర్ల సుదర్శన్ యాదవ్, అనితా కృష్ణ నాయక్, మండల అధ్యక్షుడు మాధవచారి, దళితమోర్చా మండల అధ్యక్షుడు గొల్లూరు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు

ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం రూరల్: కుళ్లిన ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తప్పవని ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ హెచ్చరించారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలోని పలు హోటళ్లను కమిషనర్ బాలకృష్ణ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. కుళ్లిన ఆహార పదార్థాలను గుర్తించారు. కిచెన్‌లో అపరిశుభ్రతపై యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా కూరగాయాలతో వంట చేయాలని సూచించారు. మాంసహారం కూడా ఎప్పటిది అప్పుడే ఫ్రెష్‌గా ఉండాలని ఫ్రిజ్‌లో పెట్టి నిల్వచేస్తే చర్యలు తీసుకుంటామని మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడితే సహించేది లేదన్నారు. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృత్తం అయితే హోటళ్లకు జరిమానాతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

- ఒకరి అరెస్టు
- పరారీలో ఐదుగురు నిందితులు

కందుకూరు: ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కొత్తూర్‌కు చెందిన ఏడెల్ల భాస్కర్‌రెడ్డి గ్రామ సమీపంలోని మల్లేష్‌యాదవ్‌కు చెందిన ఫాంల్యాండ్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఓ మహిళతో కలిసి సహజీవనం చేస్తున్నాడు. కాగా పహడీషరీఫ్‌కు చెందిన వికేష్‌యాదవ్ అలియాస్ విక్కీ(35) పాల వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తూర్‌కు నిత్యం వచ్చి పాలు సేకరించుకుని హైదరాబాద్‌కు వెళ్లి విక్రయిస్తున్నాడు. కాగా భాస్కర్‌రెడ్డితో సహజీవనం చేస్తున్న మహిళను అతను వేధించడం ప్రారంభించాడు. ఆమె సెల్ నంబర్ తెలుసుకుని తరచూ ఫోన్ చేస్తూ ఇబ్బంది పెడుతున్నాడు. దీంతో భాస్కర్‌రెడ్డి, వికేష్‌యాదవ్ కుటుంబ సభ్యులకు విషయం చెప్పి బెదిరించాడు. కక్ష పెంచుకున్న వికేష్‌యాదవ్ గురువారం అర్ధ రాత్రి తన స్నేహితుడు జగదీష్, పాటు మరో నలుగురితో కలిసి భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లి అతడిపై దాడి చేసి హత్యాయత్నం చేశారు. తీవ్రంగా గాయపడ్డ భాస్కర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కందుకూరులో 2,572 దరఖాస్తులు

- పనులు ప్రారంభించిన అధికారులు
- ఆందోళనలో ఉద్యోగులు



కందుకూరులో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

కందుకూరు: మండల పరిధిలో ధరణిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులు 2572 ఉన్నాయి. ప్రస్తుతం ఆయా దరఖాస్తుల పరిశీలనను అధికారులు చేపట్టారు. మండల వ్యాప్తంగా రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక బృందంలో తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, మరో బృందంలో నాయబ్ తహసీల్దార్‌తో పాటు ఏఎస్ఓ, జూనియర్ అసిస్టెంట్ పనులు పరిశీలిస్తున్నారు. ముందుగా గ్రామాల పరిధిలో వచ్చిన దరఖాస్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో కూడా పరిశీలించి పూర్తి నివేదికను ఆర్డీఓ కార్యాలయం ద్వారా కలెక్టర్‌కు పంపించనున్నారు. మ్యూటేషన్, విరాసత్, పీపీబీ, జీపీఓ తదితర సమస్యలతో పాటు మిస్సింగ్ సర్వే నంబర్లకు మోక్షం కలుగనుంది. కాగా, ప్రభుత్వం మాత్రం ఈ నెల 9వ తేదీ వరకే డెడ్‌లైన్ విధించడంతో అధికారుల్లో ఆందోళన మొదలయింది. ఒక్కో దరఖాస్తు వివరాలను పరిశీలించడానికి అధిక సమయం పట్టనుండటంతో ఆ తేదీ లోపు ఏలా పూర్తి చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఒక్కో రోజు గరిష్ఠంగా 30 నుంచి 50 వరకు దరఖాస్తులను పరిశీలించగలరు. కాని రెండు బృందాలు కలిసి 2572 దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది. మధ్యలో ఇతరత్రా అత్యవసర పనులు ఉండనే ఉంటాయి. దీంతో ప్రభుత్వం మరింత గడువు ఇస్తే కాని అన్ని దరఖాస్తులను పరిష్కరించలేని పరిస్థితి.

మానవ మనుగడకు చెట్లే ఆధారం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి



ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపల్లి: మానవాళి మనుగడకు చెట్లే ప్రాణాధారమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరు ఇంటింటా చెట్లు పెంచి పచ్చని గ్రామాలుగా మార్చాలని పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిలుగా హాజరై మాట్లాడారు. మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టి అడవుల అభివృద్ధికి దోహదపడాలన్నారు. చెట్లుంటే సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. భూగర్భ జలాలు పెంపొంది సంవత్సరానికి రెండు పంటలు పండే అవకాశముందన్నారు. తద్వారా ఆహారధాన్యాలు విపరీతంగా పండి దేశంలో ఆకలి కొరత తీరనుందన్నారు. చెట్లుంటే క్షేమమని, లేకుంటే క్షామమన్నారు. ప్రతి గ్రామంలో విత్తనాలు నాటి నర్సరీల పెంపకం చేపట్టాలన్నారు. ఎదిగిన నర్సరీల మొక్కలను వ్యవసాయ పొలాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, చెరువు గట్లు, కట్టపై నాటి మొక్కల పెంపకాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ కార్యదర్శులు అంజయ్యగుప్తా, రవీందర్ యాదవ్, దామోదర్, రఘురాములు, డేవిడ్, చెన్నకేశవులు, పవన్ వాల్మీకి, యాదయ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం కసిరెడ్డి నారాయణరెడ్డిని మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో చంద్రాయణపల్లితండావాసులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. చంద్రాయణపల్లి తండా, విఠాయిపల్లి, పెంటతండాల్లో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నామని, ఇందుకు ప్రతిపాదనలు పూర్తయ్యాయని ఆయన వివరించారు. మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువ నిర్మిస్తామని ఆయన వివరించారు. రాగ్యానాయక్, శ్రీదర్‌నాయక్, హర్య, గోపాల్‌నాయక్, పాల్గొన్నారు.

కళ్యాణోత్సవానికి రండీ

నాగులగుట్టపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయంలో 8న నిర్వహించే శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరు కావాలని ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆహ్వానించారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న వైస్ చైర్మన్ జీఎస్ కోహ్లి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

- గురునానక్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లి
- గురునానక్‌లో బ్యమోస్ ఫీస్టా టెక్నో కల్చరల్ ఫెస్ట్ 2024
- ఆలరించిన విద్యార్థుల ప్రదర్శనలు

ఇబ్రహీంపట్నం రూరల్: దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని గురునానక్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ సర్దార్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లి పేర్కొన్నారు. బ్యమోస్ ఫీస్టా టెక్నో కల్చరల్ ఫెస్ట్-2024 ఆదివారం ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యా సంస్థలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్లాష్‌మాబ్, గానం, వాయిద్యా, పోలో, టాలీవుడ్, బాలీవుడ్ క్విజ్, సోలో గ్రూప్ డ్యాన్స్ ,టగ్ఆఫ్‌వార్, మ్యూజికల్ చైర్స్, రంగోలితో పాటు వివిధ రకరకాల ఆటలు, పాటలతో ఆలరింపజేశారు. అనంతరం వైస్ చైర్మన్ సర్దార్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లి మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతరం చదువులే కాకుండా ప్రతిభ పాటవాలను ఒకరితో ఒకరు పంచుకోంటూ నూతన ఆవిష్కరణల మీద దృష్టి పెట్టాలని కోరారు. వివిధ భిన్నా అభిప్రాయాలు ఉన్న మన దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఉన్నతమైన చదువులు చదివి దేశానికి ఉపయోగపడలన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎస్ సైని మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు, ఆటవిడుపుగా ఉంటూ విద్యార్థుల మధ్య గురువు శిష్యుల సంబంధం బలంగా ఉండేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ పార్థసారధి, అసోసియేట్ డైరెక్టర్ రిషిసాయల్, డీన్ డాక్టర్ ఎస్‌వి రంగనాయకులు, డాక్టర్ సంజీవ్, ఈవెంట్ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ హరీష్‌కుంద్రా, వికెచారీలతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

డీసీసీబీ చైర్మన్ సత్తయ్య



ఆలయ పనులను పరిశీలిస్తున్న సత్తయ్య

తుర్కయంజాల్: అధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. శనివారం తుర్కయంజాల్‌లో నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయ పనులను పరిశీలించారు. దాతలు విరాళాలు ఇచ్చి నిర్మాణ పనులు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని ఆలయ కమిటీ సభ్యులను ఆయన కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజుగౌడ్ నరేందర్, పాల్గొన్నారు.

భూ సమస్యలకు చెక్

- మండలంలో రెండు రెవెన్యూ బృందాల ఏర్పాటు
- పెండింగ్ దరఖాస్తులు 353
- ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తాం డిప్యూటీ తహసీల్దార్ సంతోశ్



తహసీల్దార్ కార్యాలయం

తలకొండపల్లి: భూ దస్త్రాల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఆ దిశలో రెవెన్యూ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 1 నుంచి 9 వరకు పెండింద్ భూ సమస్యలన్నింటిన్నీ పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తలకొండపల్లి మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు గాను రెండు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 353 పెండింగ్ దరఖాస్తులున్నాయి. ఖాస్రా, పహాణి, సేత్వార్, భూక్రయ, విక్రయాలకు సంబంధించి భూ పట్టా పేర్లు మారిడి, భూ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, విరాసత్, పాస్ బుక్‌లు, కోర్టు కేసుల సమస్యల పరిష్కారం, తదితర వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల వారీగా ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు.

గ్రామాల వారీగా షెడ్యూల్ వివరాలు

మార్చి 1న రాంపూర్, మెదక్‌పల్లి, లింగరావుపల్లి, రామకృష్ణాపురం, 2న పడకల్, చంద్రధన, జూలపల్లి, 4న తలకొండపల్లి, బద్నాపూర్, చుక్కాపూర్, యడవల్లి, 5న చెన్నారం, చీపునుంతల, అంతారం, వెంకటాపూర్, 6న వెల్జాల్, తిమ్మాపూర్, ఖానాపూర్, గౌరిపల్లి, 7న వెంకట్రావ్‌పేట్, గట్టుఇప్పలపల్లి, తదితర గ్రామాల్లోని భూ సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించనున్నారు. ప్రతి దరఖాస్తుకు అనుబంధంగా ఆధారాలను సేకరిస్తున్నారు. క్షేత్రస్థాయి విచారణకు వీలుగా షెడ్యూల్ నిర్ణయించుకుంటున్నారు.

ప్రతి దరఖాస్తును పరిష్కరిస్తాం

మండలంలో 353 పెండింగ్ దరఖాస్తులున్నాయి. వీటి పరిష్కారానికి రెండు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేశాం. ప్రతి రోజు రెండు నుంచి 4 గ్రామాల చొప్పున సమస్యలను పరిష్కారానికి ప్రత్యేక షెడ్యూల్ రూపొందించాం. నిబంధనల మేరకు ప్రతి దరఖాస్తును పరిశీలిస్తాం. అవసరమనుకుంటే క్షేత్రస్థాయిలో ఫీల్డ్ విజిట్ చేసి సమస్యను పరిష్కారిస్తాం. అనంతరం ప్రత్యేక నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తాం.

–సంతోశ్, డిప్యూటీ తహసీల్దార్, తలకొండపల్లి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు రిపోర్టులు అందజేసిన డాక్టర్లు

ఇబ్రహీంపట్నం రూరల్: సాహెబ్‌గూడలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్‌క్యాంపు శనివారం నిర్వహించారు. 150 మందికి పైగా పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేశారు. ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్తు మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ జహంఘీర్‌ఖాన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌సీ కేంద్రం రంగారెడ్డి జిల్లా మెడికల్ అధికారి డాక్టర్ నిహా అహ్మద్, సీఎస్‌సీ హెల్త్‌కేర్ సాయితేజ, శివ, రాజశ్రీలతో పాటు తదితరులు పాల్గొన్నారు. మహిళా అధ్యక్షురాలు రమేశ్వరి, ముస్లిం మహిళా అధ్యక్షురాలు పైమీద, ఎస్సీసెల్ అధ్యక్షురాలు లక్ష్మమ్మ, మహిళా గ్రూపు సంఘం అధ్యక్షురాలు కవితలు పాల్గొన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు ముఖ్యం

రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు జోగిరెడ్డి



టీకా వేస్తున్న పశువైద్యుడు జోగిరెడ్డి

యాచారం: వేసవి కాలంలో పశుపోషణపై జాగ్రత్తలు అవసరమని రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు కొంగళ్ల జోగిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నందివనపర్తిలో సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 750 పాడిపశువులు, గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ.. పశు పోషణ, వ్యాధుల నివారణపై సకాలంలో గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తే ఇబ్బందులు ఉండవని అన్నారు.